# నీడ

రచన: కె. కె. మీనన్

రాత్రి ఎనిమిదిగంటలైంది. రమణ ఇంకా ఇంటికి రాలేదు.

ఒంటిని ఆశ్రయించుకున్న రోగం ఒంటరితనంలో మరింత పెరిగినట్లు వణకసాగింది సరళ.

"ఆయన వేగిరం వస్తే బావుండును" అనుకుంది

"వచ్చి ఏం బావుకుంటారులెద్దూ! ఇలా క్షణాల్లో నయినా వారు సుఖంగా కాలం గడపగల్గితే......" అనుకుంది వెనువెంటనే.

అనుకుందేగాని అతని రాకకోసం ఆమె హృదయం ఆరాటపడక మానలేదు. తనకలవాటైనచోటుకు వచ్చి కిటికీ తలుపులు తెరచి బైటకి చూస్తూ నిలబడింది.

బయట పుచ్చపువ్వులు విచ్చినట్లు పుడమి వెన్నెలను పుక్కిలిస్తోంది. పార్కులో వెన్నెల స్నానాలు చేసి వెనక్కిమరలి పోతున్నాయి జంటలు అందమైన ఆ వెన్నెలని చూసి వణికిపోయింది సరళ.

ఒకప్పుడు ఆనందాన్ని ఎత్తిపోసిన ఆ వెన్నెల వింతగా భయపెడుతోంది.

వెన్నెలకౌగిట్లో వింతగా పరుచుకున్న చెట్లనీడలు కరిగి నిరాశగా తన హృదయంలోకి ప్రవహిస్తున్నట్లనిపించింది సరళకు. ఎన్నో వెన్నెల రాత్రులు భర్తతో ఆ పార్కులో గడిపింది. పార్కు నిర్మానుష్యమైపోయే వరకూ తాము ఆ కన్పించే చెట్టు క్రిందనే కబుర్లు చెప్పుకుంటూ గడిపేవారు. వెన్నెలని మించిన పాలనురుగు వన్నె చీరకట్టుకుని భర్తవడిలో ఒరిగి నింగిలోని చందమామని చూస్తూవుంటే తన కళ్ళల్లోకి చూస్తూ అలాగే వుండిపోయేవాడు రమణ,

'ఈ చందమామని చూసి అసలు మామ సిగ్గుపడుతున్నాడు సుమా' అని పరిహాసిస్తూ మురిసిపోయేవాడు.

వెన్నెముకలాంటి సంఘాన్ని, జీవనాడుల్లాంటి తల్లి దండ్రుల్ని ధిక్కరించి ఈ చందమామను చేజిక్కించుకున్నాడు. పాపం! రాహువులా ఈరోగం తనకోసం వేచివున్నదని అతనికేం తెల్సు?

ఈ చందమామని రాహువు మింగేస్తున్నాడని జ్యోతిష్కుడిలాగ ప్రకటించాడు డాక్టర్. తనింక దాంపత్య జీవితానికి పనికిరాదట! ఎందుకో డాక్టర్లకింత నిర్దయ. రోగమయినా కాస్త కనికరిస్తుందేమో గాని యీ డాక్టర్లు...ఊహూ...నీవెందుకు పనికిరావని తెగేసి చెప్పేస్తారు.

భర్తనీ తనపై అతనికిగల అవ్యాజానురాగాన్ని తల్చుకుని వణికిపోయింది సరళ

'భగవాన్! నాకోసం ఆయన చేసిన త్యాగాలకి ప్రతిఫలం ఏం ఇవ్వగలిగాను' అని వాపోయింది. తను అంత త్వరగా చావదు. కేన్సరు రోగి చావక తప్పదు. బ్రతికి ఇక అతన్నేం సుఖపెట్టగలదు. రెండేళ్ళ వైవాహిక జీవితంలోనూ తను అతనికి ఇచ్చిందీ...అతన్నించి పొందిందీ ఎక్కువేకావచ్చును అంతమాత్రాన అతని నూరేళ్ళ జీవితానికీ రెండేళ్ళలోనే తెర దించెయ్యనక్కరలేదు.

తను అతనికి ఇవ్వలేని సుఖంకోసం వెర్రిగాఆలోచించసాగింది. ఆయాలోచనల తలమునకలో ప్రక్కనున్న భర్త వునికినే గమనించలేకపోయింది.

భుజం మీద అతని చేతులు పడగానే వులిక్కిపడింది.

'ఏమిటి సరళా అంత తీవ్రంగా ఆలోచిస్తున్నావ్?'

ఆమె జవాబివ్వలేదు. అతని ముఖంలోకి నిశ్చలంగా చూస్తు నిలబడింది.

అతని కళ్ళు అప్యాయంగా ఆమె వొళ్ళు నిమురుతున్నాయి.

ఆమె వొళ్ళు అతని కళ్ళల్లో కరిగిపోతున్నది. అతని పొందుకోసం తపన పెరిగిపోతున్నది.

కాని అతడు?

ఆమె ఆరోగ్యంకోసం సర్వసుఖాలనీ త్యజించిన ప్రేమమూర్తి. ఆమె క్షేమానికి విరుద్ధంగా ఏ చిన్న పనీ చేయలేడు.

అది గుర్తుకు రాగానే ఆమె నీళ్ళుగారిపోయింది.

ఆమె స్వభావం ఎరిగిన రమణ ఆమెను పొదివి పట్టుకుని లోపలికి నడిపించుకుపోయాడు.

భోజనాలు మౌనంగానే సాగిపోయాయి.

భోంచేస్తున్నంతసేపూ తను అడగదల్చుకున్న మాటలు వల్లె వేసుకుంటూనే వున్నది సరళ. కాని కాని పడక వేళకిగాని ఆ ప్రసక్తి తేలేక పోయింది.

"నాదో చిన్న కోర్కె తీర్చగలరా" అనడిగింది. అతని కన్నుల్లోకి దీనంగా చూస్తూ.

'ఒకటేమిటి సరళా! సాధ్యమైతే లక్ష కోర్కెలు ఒక్కసారే తీర్చగలను" అన్నాడు హుషారుగా.

"ఒక్కటే ఒక్క కోర్కె ...మీరు తీర్చగలిగేది

"సందేహమెందుకు సరళా! అడుగు"

"మీరు పెళ్ళి చేసుకోండి!" అంది చప్పున.

లైట్లన్నీ ఒకేసారి ఆరిపోయినంత చీకటయింది అతని ముఖం. మేధస్సు ఉక్కిరిబిక్కిరై ఆలోచనా రహితమైంది.

"మందేసుకున్నావా సరళా!" అనడిగాడు ఏమీ తోచక.

ఆమె మందు తాగిందని తెల్సు. తాగించింది కూడ తనే. కాని ఆ విపత్తునుంచి తప్పుకోటానికి అంతకంటే మరో గత్యంతరం లేదు.

అతని అవస్థ పసికట్టి ఊరుకున్నది సరళ.

అతని మనస్సెరిగి మరింత కృంగిపోయింది.

అతని సుఖంకోసం మార్గాలు అన్వేషించక మానలేదు.

x x x

హుస్సేన్‌సాగరు ఫెన్సింగ్‌ను ఆనుకునిదూరంగా విమానాశ్రయంలో తళుక్కుమంటున్న లైట్‌హౌస్‌ను చూస్తోంది సరళ. ఆమె ప్రక్కనే కాళ్ళక్రింది అఖాతంలో పరుచుకుంటున్న నీలి నీడల్ని వాటిని చెదరగొట్టటానికి శుష్క ప్రయత్నం చేస్తున్న నక్షత్రాలు మసగ వెల్తురినీ పరిశీలిస్తున్నాడు రమణ. వాళ్ళమనస్సులు వేరువేరు ఆలోచనల్లో మగ్నమై వున్నాయి. వారు చూస్తున్న దృశ్యాలు వారి మనోభావాలకి సంకేతాలు.

"నమస్కారం సార్"

సన్నని కంఠం విని ఇద్దరూ వెనక్కి తిరిగారు. చక్కగా అలంకరించుకొన్న ఒక నవనాగరిక యువతి నవ్వుతూ నిలబడింది. ఆమె సౌందర్యవతి కాదని అనలేం. కాని సరళకు సాటయినది కాదామె సౌందర్యం. అలంకరణలో ఆమె తీసుకున్న శ్రద్ధకి మాత్రం ఎంతటి బుశ్యశృంగులైనా భంగ పడక తప్పదు.

"ఓ...రజనీ...ఏం ఇట్లావచ్చావు చల్లగాలికా"

"ఈమె నాస్నేహితురాలు వేరు రజని. ఈమె నా శ్రీమతి సరళ"

పరిచయం చేశాడు రమణ.

ఆ అమ్మాయిని చూడగానే సరళ ఆలోచనలకి ఆకారం అబ్బినట్టయింది. వెనక్కి తిరిగి మరోసారి

చూసింది. లైట్‌హౌస్ మీదనుంచి ఏంబర్...గ్రీన్ మారి మారి తళుక్కుమంటుంది.

భర్తను పిలిచింది.

''ఏమిటి సరూ?'

"ఒక్క సహాయం చేసి పెట్టగలవా?''

అదిరిపడ్డాడు రమణ. మరలా ఎలాంటి కోరిక కోరుతుందోనని భయం.

"నాకు బొత్తిగా కాలక్షేపం కావటం లేదండీ. ఆవిడచేత నాకు టైపు నేర్పించకూడదూ"

'హమ్మయ్య!' అనుకున్నాడు రమణ

"అలాగే దానికేముంది సరూ! కాని నీ వెక్కువ శ్రమ పడకూడదు"

"మీరు చెప్పినట్లే వింటానుగా...ఏమండీ రజని గారూ! ఉదయం నాకోగంట నేర్పలేరా?"

రజని తటపటాయించింది.

"కాదనకు రజనీ, ఇష్టంవచ్చిన ఫీజుపుచ్చుకో రోజూ ఉదయం ఒక గంట మాత్రం చెప్పు. నాతో బాటే కార్లో ఆఫీసుకు పోవచ్చు.

రజని కాదనలేకపోయింది.

x x x

రజనికి అయింట్లో చనువు పెరిగినంత శీఘ్రంగా సరళ టైపింగ్ పరిజ్ఞానం పెరగలేదు. ఆమాటకొస్తే అసలు స్ట్రయికింగ్ రాలేదు. అది రజని తప్పుకాదు ఆమె సిన్సియర్‌గా చెప్పాలని ఎప్పుడు ప్రయత్నించినా

"చూడు రజనీ! నేను లేవలేకుండా వున్నాను... ఆయనకేం కావాలో కాస్త చూసిపెట్టగలవా?" అంటుంది వేడుకోలుగా.

రమణకి ఒకరకమైన జీవితం అలవాటైపోయింది అతనికేం కావల్సి వచ్చినా 'సరళా' అంటూ పిలవడం, ఆమె ; రజనిని పురమాయించటం రివాజయిపోయింది. ఇక సెలవు రోజులన్నీ అక్కడే గడిచిపోతున్నాయి రజనికి.

అవసరంలేని విషయాలపైన అందరికీ ఆసక్తి వుంటుంది.

ఆఫీసులో స్కాండల్సు రేగేయి.

ఒకరోజున ఆకాశరామన్న వుత్తరం తెచ్చి సరళ దగ్గర ఏడ్చింది రజని· స్త్రీగా ఆమె హృదయం ద్రవించిపోయింది. కాని ఒకవిధంగా సంతోషించక పోలేదు.

"నీవు ఏ పాపం ఎరుగవుగాబట్టి ఇంతగా బాధపడ్తున్నావు రజని. అది నిజమైతే మాత్రం తప్పేమిటి?"

''మీరుకూడా నన్ను అపార్థం చేసుకుంటున్నారా మేడమ్?''

''లేదు రజనీ...ఆయన వయస్సులో వున్నారు నీవా అవివాహితవి...లోకులు కాకులు రజనీ...''

"అందుకే ఉద్యోగం వదిలి వెళ్ళిపోవాలనుకుంటున్నాను''

''ఉద్యోగం ఇష్టంలేకుంటే మానెయ్యి కాని ఎక్కడికీ వెళ్ళద్దు చెల్లీ''

ఆ కొత్త పిలుపుకి స్తంభించిపోయింది రజని.

''ఇలారా...నాదగ్గరగా కూర్చో రజనీ...''

రజని అసంకల్పితంగానే ఆమెప్రక్కన సోఫాలో కూర్చొంది.

సరళ ఆమె తల నిమురుతూ అడిగింది.

"నువ్వింకా పెళ్ళి చేసుకోవా రజనీ''

''పెద్దవాళ్ళు చెయ్యాలంటున్నారండి. పేదవాళ్ళకి పెళ్ళిళ్ళంత తొందరగా అవుతాయా?"

సరళ కొంచెంసేపు ఆగి మరలా అడిగింది.

''ఆయన అందంగా వుంటరా రజని''

అయాచితమైన ఈ యప్రస్తుతపు ప్రశ్నకి ఆమె వద్ద జవాబు లేదు.

"ఆయనెంత అందంగా వుంటారో ఆయన హృదయం అంతకంటె అందమైంది"

"అవునండీ ఆఫీసులో అంతా అలాగే అంటుంటారు"

"మరి నీ కభ్యంతరం లేకపోతే వారిని పెళ్ళిచేసుకోరాదా రజనీ"

రజనిఅదిరిపడింది. అది వేడుకోలో వెక్కిరింపో తెలియని సందిగ్ధావస్థలో పడింది.

"వారికేంతక్కువ రజనీ. అందంవుంది హోదా వుంది అన్నిటికంటే మించిన మంచి హృదయముంది పీటికి నోచుకోని నష్టజాతకం నాది రజనీ నేనుమహా బ్రతికితే ఒక్క సంవత్సరం...ఆతర్వాత ఆయనేమై పోతారోనని బెంగగా వుంది నీవు నాకు సద్భావు రజనీ. ఆయన్ని సుఖపెట్టగలవనే విశ్వాసం ఏర్పడింది"

రజని మాట్లాడలేదు,

ఆమె చేతులు పట్టుకుంది సరళ.

"కాదనకు రజనీ. నేను నీ కేవిధంగానూ అడ్డురాదు. నీద్వారా ఆయన సుఖపడుతున్నారని నేను బ్రతికుండగనే తెల్సుకుంటే నా కంతే చాలు...నిశ్చింతంగా చచ్చిపోతాను.

"అవేం మాటలండీ"

"నాబాధ నీకర్థం కాదు రజనీ...నాకోసం ఆయనెన్ని కలలు కన్నారో నాకే తెల్సు. ఆ కలలన్నీ కల్లిచేడి నేనెందుకూ పనికిరాకుండా పోయాను"

చేతుల్లో ముఖం దాచుకుని ఏడ్చింది.

"ఊరుకోండి" రజని ఓదార్చక తప్పలేదు

అయిదారు నిమిషాల తర్వాత

"ఏమంటావు రజనీ" అనడిగింది

"నన్ను కొంచెం ఆలోచించుకోనీండి"

ఆ క్షణలో రజనికళ్ళ ముందు ఆఫీసూ, ఆమెను స్కాండలైజ్ చేసే అక్కడి మనుషులూ మెదిలారు.

X X X

సరళ జీవితం వింతయిన మలుపు తిరిగింది

తనస్థానం ఆక్రమించుకొన్న రజనిపై ఆమెకె లాంటి అసూయాలేదు. కాని ఆ యింట్లో తన వునికి కేవలం తను జీవించి వున్నానని భావనగా మాత్రమే మిగిలిపోయింది, అదే ఆమె బాధ.

నిరంతరం నీడలా భర్తని వెంటాడి బ్రతకాలనే ఆమె కోర్కె, అర్థాంతరంగానే అడియాశగా మారిపోయింది ఆఫీస్ నుంచి అలసి వచ్చిన భర్తకు కాఫీ ఇవ్వాలని ఆరాట పడుతుంది. 'నీ యారోగ్యంబాగో లేదు కూర్చో' అని తనేతీసుకుపోతుంది రజని. అలవాటు ప్రకారం అతను రాగానే ఎదురెళ్ళి కోటు అందుకోవాలని. సపర్యలు చెయ్యాలని తాపత్రయ పడుతుంది. కాని అవన్నీగగనకుసుమాలేఅయ్యాయి.

"ఆరోగ్యం బాగోనప్పుడు నీకెందుకు సరూ తాపత్రయం. రజని వుందిగా నువు విశ్రాంతితీసుకో అని మెత్తగా మందలిస్తాడు రమణ.

X X X

"రజనీ కాస్త ఇలావస్తావ్?"

రజని చేతిలో పత్రికతో ప్రత్యక్షమైంది.

"ఎందుకండీ"

"నేను ఆఫీస్ కాగితాలు చూసుకుంటూవుంటాను. యీ టిఫిన్ కాస్త నోట్లో పెడుదూ"

"పాపం బుజ్జాయికి తినిపించాలి గావల్ను. ఆ ఫైళ్ళక్కడ పారేసి తినండి" అంటూ వెళ్ళబోయింది

"నేను పెడతాలే నువ్వెళ్ళు రజని" అంటూ ప్రత్యక్షమయింది సరళ.

"అక్కర్లేదు నేనుపెట్టగలను" అంటూ తిరిగొచ్చి ప్లేటు తీసుకుంది రజని.

సరళ దిక్కు మోహం వేసుకొని వెళ్ళిపోయింది.

"నేను తినగలను అక్కడ పెట్టివెళ్ళు"

"ఏం కోపం వచ్చిందా?"

"నువ్వు చేసిన పనేమిటి రజనీ? ఆమెకూడ నీ లాంటి మనిషేనని మర్చి పోతున్నావా? ఆమెకూ కోర్కెలుంటాయని తెలీదా?"

"ఎందుకు తెలీదు? కాని ఆమె పరిస్థితి ఏమిటి? ఆ రోగిష్టిమనిషి ప్రతిపన్లోనూ ఇలా కల్పించుకుంటే మీకారోగం సోకదనే నమ్మకమేంటి?"

"అంతకంటే అదృష్టమా?"

"అవును మరి నా బ్రతుకేం కావాలో?"

"నరళకి రోగమొస్తే నా బ్రతుకేమయింది"

"అంటే నన్ను మళ్ళీ పెళ్ళి చేసుకొమ్మనా? అవు న్లేంది మగవారుగదూ? ఎంతలేసి మాటలనడానికైనా స్వతంత్రం వుంది"

వాళ్ళ వాగ్ధోరణికి భయపడి మరలా వరుగెత్తు కొచ్చింది సరళ

"రజనీ...ఇంకెప్పుడూ నేను మీ మధ్యకు రాను. ఆయన మీద ఒట్టేసి చెపుతున్నాను అల్లరి పెట్టకు తల్లీ"

"పైగా ఇదొకటి ఆయనన్నేదో పెద్ద పేపుకు తిం టున్నట్టు"

అంటూ విసురుగా వెళ్ళిపోయింది.

X X X

నరళ ఆరోగ్యం పూర్తిగా క్షీణించింది. పూర్వంలా బ్రతిమాలి బామాలి మందులు తాగించే అవకాశమూ, ఓపికా రమణకి లేవు. మందులు త్రాగి ఆ బ్రతుకుని మరికొంత కాలం పొడిగించుకోవాలనే ఆనక్తి లేదు నరళకి.

దగ్గుతో తరచు రక్తం కక్కుకొంటుంది.

ఆమె మూలంగా ఇంట్లో కీచులాట పెరిగి పోతు న్నాయి.

ప్రక్క గదిలోంచి మాటలు విన్పిస్తున్నాయి నరళకి—

"రోగిష్టి మనిషిని అలా ఇంట్లో పెట్టుకు కూర్చో పోతే ఏ నర్సింగ్ హోంలోనయినా చేర్పించరాదూ, ఇంటిల్లిపాదికీ అరోగం అంటాలనా?"

ఆఫీస్ పనుల్లో సతమతమై అప్పుడే ఇంటికివచ్చిన రమణకి చికాగ్గా వుంది.

"మాట్లాడరే" రెట్టించింది.

"రోజుల్లోవున్న ఆ మనిషి ప్రాణాన్ని నర్సుల చేతుల్లో వడెయ్యమంటావా? చివరి రోజుల్లో ఆమెను నా కళ్ళ ముందుంచవా రజనీ ఎందుకిలా రాక్షసిలా తయారయావు? ఆమె నీకు చేసిన ద్రోహంఏమిటి?"

"ఏమిటో మీకు తెలీదా?"

"ఎందుకు తెలీదు ఆమె చేసిన మంచి పనులన్నీ ఇప్పుడు చెప్పుకున్నా ప్రయోజనం లేదు" అంటూ నరళ గదిలోకి వచ్చాడు.

గోడవార తిరిగి పండుకొన్నది నరళ.

మంచంపై కూర్చొని ఆమెను తనవైపుకు తిప్పు కున్నాడు. ఆమె కనుగుంటల్లో అరని కన్నీళ్ళు ఆమె దగ్ధ హృదయానికి సాక్ష్యం పలికాయి.

"ఏమిటి నరూ! ఏడుస్తున్నావా?"

"లేదు. మీరు నాదగ్గరకు రాకండి వెళ్ళిపొండి"

"ఆ మాటలన్నీ ఎందుకు వింటావు నరూ? నీకు నేనున్నాను. ఎందుకు బాధపడ్తావు?"

"నాకెందుకండీ బాధ. కాని నన్నే నర్సింగ్ హోంలోనో పారేస్తే పుణ్యముంటుంది"

"ఒద్దు నరూ? అఖరి క్షణాల్లో నువ్వు నావదిలో వుండాలి. అక్కడెక్కడో వుంటే ఆ క్షణాన్ని నేను అందుకోలేకపోవచ్చు.

"ఎందుకండీ నేనంటే మీకంత ప్రేమ."

'ఎందుకో నీకెలా తెలుస్తుంది నరూ? నీవు పెంచిన ప్రేమనే త్రుంచివేయటానికి సర్వశక్తులా ప్రయత్ని

తావు. త్యాగాలు చేశావు కాని త్యాగం ప్రేమని పెంపొందిస్తుందని నీ మంచి మనసుకు తెలియదు నరూ!"

"ఇంకెక్కువ మాట్లాడకండి గుండెలు పగిలిపో తున్నాయి"

"సరే రెస్టు తీసుకో"

దుప్పటి సరిచేసి వెళ్ళిపోయాడు.

x x x

రాత్రంతా నిద్రలేదు సరళకి. ఆలోచనల తరంగాలు ఆమె హృదయాన్ని కల్లోలితం చేసాయి. ప్రక్కవైపడుకోటానికి మనస్కరించలేదు. ప్రాణాలు కూడగట్టుకొని తనకు ప్రాణప్రదమైన కిటికీ చెంతకు చేరింది కిటికీ తెరిస్తే శీతాకాలవు చలిగాలి జివ్వున మొగానికి కొట్టింది.

బయట వెన్నెల పిండారబోసినట్లుంది. ఎదురుగా పార్కు నిర్మానుష్యంగా వుంది పార్కులో తామె వ్వుడూ కూర్చునే చెట్టుసీద నేలపైపరుచుకుని బ్రహ్మ రాక్షసి తల విరబోసుకున్నట్లున్నది. ఆ చెట్టుక్రింద రమణతో ఆమె గడిపిన వెన్నెల రాత్రులు ఆకళింపుకు వచ్చాయి. అక్కడ భర్తకౌగిట్లో నిద్దరోవాలనే విచ్చికోర్కె జనించింది ఆమెలో కాని...అసంభవం మెట్లుదిగి మెల్లగా పార్కువైపు దారి తీసింది.

జనవరి నెల చలికి ఆమె శుష్కించిన తనువు ఎండుటాకులా కంపించిపోతోంది.

సన్నగా దగ్గుతెర వచ్చింది.

అడుగులు తడబడుతున్నాయి

శక్తిని కూడగట్టుకొని చెట్టుక్రిందికి నడిచింది.

సీడలో ఒక నల్లటి ఆకారం కదలటం చూసి కెవ్వున అరిచింది.

పెద్ద దగ్గుతెర...

భళ్ళున నెత్తురు కక్కింది;

నల్లని లాంకోటు తొడుక్కున్న ఆకారంఆమెను పొదివి పట్టుకుంది.

"ఇంతరాత్రివేళ ఎందుకొచ్చావు నరూ?"

ఆమె మాట్లాడలేదు.

నీరసించిన ఆమెముఖాన్ని...రక్తసిక్తమైన ఆమె గుండెల్ని ఆత్రంగా ముద్దుపెట్టుకొంటున్నదా యాకారం.

Phone : 38537

SADHANA MEDICAL STORES

CHEMISTS & DRUGGISTS

LAKDI-KA-PUL, HYDERABAD-4.